సాక్షి విజయనగరం

7

సోమవారం ၊ 21 ၊ ఆగస్టు ၊ 2023

న్యూస్‌రీల్

నేడు సీనియర్ రెసిడెంట్ పోస్టులకు వాకిన్ ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: సీనియర్ రెసిడెంట్ (రేడియో ఇగ్నోసిస్), డెర్మటాలజీ విభాగాలకు సంబంధించిన పోస్టులకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు వాకిన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు విద్యార్హత కలిగిన అభ్యర్థులు విజయనగరం.ఎస్‌బిసి.ఇన్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని ఒరిజనల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలో కనీసం 10 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించిన వారు అవార్డులకు అర్హులని తెలిపారు. ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను ఈ నెల 22వ తేదీలోగా మండల విద్యాశాఖాధికారి/డిప్యూటీ ఈఓ కార్యాలయాల ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

మనస్వినికి నగదు పారితోషికం



సామల మనస్వినికి రూ.50వేలు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

జియ్యమ్మవలస: యూఎన్‌ఓ డెలిబ్రేషన్ ప్రొగ్రాంకు ఎంపికైన సామల మనస్వినికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తమ నివాసంలో రూ.50 వేల నగదు పారితోషికం ఆదివారం అందజేశారు. గుమ్మలక్ష్మీపురం కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న మనస్వి అమెరికాలో జరగనున్న యూఎన్‌ఓ డెలిబ్రేషన్ ప్రొగ్రాంకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు ఐక్యరాజ్య సమితి చర్చలకుగాను ఆంధ్రప్రదేశ్ నుంచి 10 మంది విద్యార్థులను ఎంపిక చేయగా అందులో మనస్విని ఒకరు. ఇటీవల కురుపాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న సభలో మనస్విని మాట్లాడుతూ అందరి ప్రశంసలు అందుకుంది. దీంతో యూఎన్‌ఓ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మనస్విని ప్రత్యేకంగా ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగంలో అమల్లోకి వచ్చిన నూతన విద్యా విధానంపై వీరంతా ప్రసంగించనున్నారు. భవిష్యత్‌లో మనస్విని మరింతగా రాణించి గుర్తింపు తేవాలని వారు ఆకాంక్షించారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



నవజాత శిశువుల విభాగాన్ని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. జిల్లా ఆస్పత్రిలో పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్‌ఆర్‌సీ), నవజాత శిశువుల అత్యవసర విభాగాలను ఆయన ఆదివారం సందర్శించారు. ముందుగా ఎన్‌ఆర్‌సీలో చిన్నారుల ఆరోగ్యాన్ని పరిశీలించి, వారికిస్తున్న చికిత్స, పోషకాహార మెను రికార్డులను పరిశీలించారు. పిల్లలు అడ్మిట్ అయినప్పుడు ఆరోగ్య స్థితి, ప్రస్తుతం ఏ మేరకు ఆరోగ్యం వృద్ధి చెందినదీ పరిశీలించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి, ఎక్కడి నుండి వచ్చారు.. అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ పిల్లల బరువును నమోదు చేసి, వృద్ధి చెందే వరకు పోషకాహారం, చికిత్సను పూర్తి స్థాయిలో అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్‌ఎన్‌సీయూలో నవజాత శిశువుల ఆరోగ్య వివరాల రికార్డులను పరిశీలించారు. ఎక్కువగా ఏ అనారోగ్య కారణాలతో అడ్మిట్ అవుతున్నదీ, ప్రతి నెలా ఎంత మంది పిల్లలు అడ్మిట్ అవుతున్నారు... తదితర వాటి గణాంకాలను రికార్డుల్లో పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది గుర్తించిన నవజాత శిశువుల అడ్మిషన్ వివరాలు సిబ్బందిని అడిగి తగు సూచనలు చేశారు. ఆయన వెంట సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ధనలక్ష్మి, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఆర్‌బీకేలు

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతే రాజయ్యాడు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తూ వారికి అన్ని విధాల సాయం చేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. దీంతో రాష్ట్రంలో అన్నదాత ఆనందిస్తున్నాడు.

- విత్తు నుంచి ఎరువుల వరకు అందజేత
- నాలుగేళ్లలో 15.61 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇందుకు రైతులకు చెల్లించిన మొత్తం రూ.2990.61 కోట్లు
- రైతు భరోసా కింద రూ.1467.79 కోట్లు చెల్లింపు
- 1,56,575 క్వింటాళ్ల విత్తనాల అందజేత
- 54,507 మెట్రిక్ టన్నుల ఎరువుల అందజేత



బాడంగి మండలం రేజేరు ఆర్‌బీకేలో రైతుకు ఎరువులు అందిస్తున్న వ్యవసాయ సహాయకుడు

విజయనగరం ఫోర్ట్:

వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు పరిపాలన తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే వ్యవసాయాన్ని పండుగగా మార్చి అన్నదాత కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నారు. అన్నదాతకు అండగా ఉంటూ రైతే రాజు అన్న నానుడిని నిజం చేస్తూ ముందుకు సాగుతున్నారు. సాగులో పెట్టుబడి సాయం కోసం రైతు భరోసా ద్వారా నగదు జమ చేసి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి అన్ని విధాల ఆదుకుంటున్నారు. విత్తు దగ్గర నుంచి ఎరువుల వరకు అన్ని రైతుల ముంగిటకు చేర్చుతున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. రైతులకు విత్తనం అందజేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రభుత్వమే అన్ని చూసుకుంటోంది. పంటల సాగులో అవసరమైన పెట్టుబడి కోసం రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా పేరిట రూ.13,500 ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోంది.

రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)ను ఏర్పాటు చేసింది.

రైతు భరోసా కేంద్రాలు రాక ముందు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లేవారు. పండించిన ధాన్యాన్ని కూడా విక్రయించుకోవడానికి దూర ప్రాంతంలో ఉన్న మిల్లులు వద్దకు వెళ్లేవారు. రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత రైతుల ముంగిటకే సేవలు అందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్దే అందుతున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు కూడా రైతు భరోసా కేంద్రాల వద్దే జరుగుతుంది. ధాన్యాన్ని రైతుల కళ్లాల దగ్గరకు వెళ్లి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఈ - క్రాప్ బుకింగ్, విత్తనాలు రిజిస్ట్రేషన్ ఇలా రైతులకు అవసరమైన అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు అందుతున్నాయి. పంట నష్టం జరిగినప్పుడు అంచనా వేయడం కూడా రైతు భరోసా కేంద్రం సిబ్బందే చేస్తున్నారు. పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువులు వినియోగం తదితర సాంకేతిక సహకారం, సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వ్యవసాయ సహాయకులను నియమించింది. వారు రైతులకు నేస్తాలుగా మారిపోయారు. ఇలా ఆర్‌బీకేలు రైతుకు అన్ని విధాల అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో 510 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి.

ధాన్యం కొనుగోలు బాధ్యత కూడా...

దళారులు, వ్యాపారులు ప్రమేయం లేకుండా ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. ముఖ్యంగా మిల్లర్ల పాత్ర లేకుండా ప్రభుత్వం రైతులకు మేలు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. అంతేకాకుండా రైతులకు రవాణా, కళాసీ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది.



గొల్లలపేట ఆర్‌బీకే వద్ద విత్తనాలు అందజేస్తున్న సిబ్బంది

ఎరువులు వివరాలు

సంవత్సరం	మెట్రిక్ టన్నులలో
2021-22	25,705
2022-23	22,547
2023-24	6,255

విత్తనాల వివరాలు

సంవత్సరం	విత్తనాలు క్వింటాళ్లలో
2020-21	34,821
2021-22	37,460
2022-23	41,418
2023-24	42,876



గంట్యాడ మండలం కొర్లాంలో రైతు భరోసా కేంద్రం

వైఎస్సార్ రైతు భరోసా నిధుల వివరాలు

సంవత్సరం	రైతులు	వెచ్చించిన నిధులు
2019-20	2,03,451	రూ.276.65 కోట్లు
2020-21	2,39,363	రూ.323.14 కోట్లు
2021-22	2,46,438	రూ.332.69 కోట్లు
2022-23	2,51,659	రూ.343.55 కోట్లు
2023-24	2,58,324	రూ.193.74 కోట్లు

2019 నుంచి 2022 వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు

సంవత్సరం	ధాన్యం మెట్రిక్ టన్నులలో	చెల్లించిన నిధులు
2019-20	4,52,045	రూ.869.19 కోట్లు
2020-21	4,60,384	రూ.869.19 కోట్లు
2021-22	3,06,713	రూ.595.01 కోట్లు
2022-23	3,41,880	రూ.697.25 కోట్లు

ఆర్‌బీకేలతో కష్టాలు తప్పాయి



రైతు భరోసా కేంద్రాలు లేనప్పుడు విజయనగరం వెళ్లి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే వారం. ఇప్పుడు ఆ కష్టాలు తప్పాయి. మా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. నేను పండించిన ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రం వద్ద కొనుగోలు చేశారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో డబ్బులు జమ చేశారు. గతంలో వ్యాపారులకు ధాన్యం విక్రయించేవాడిని. దీని వల్ల గిట్టుబాటు ధర వచ్చేది కాదు. ఇప్పుడు గిట్టు బాటు ధర వస్తుంది.

– పొటుపురెడ్డి ఆదినారాయణ, రైతు, రాకోడు గ్రామం

ఏటా రైతు భరోసా



ప్రతి ఏటా నిర్దేశించిన సమయానికి రైతు భరోసా డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి. రైతు భరోసా కేంద్రం ద్వారా ఈ - క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. దీని వల్ల పంట సాగు చేసిన నిజమైన రైతులకు మాత్రమే లబ్ధి కలుగుతుంది. రైతు భరోసా పథకం కింద డబ్బులు ఇవ్వడం వల్ల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నాను. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం వడ్డీకి అప్పు తెచ్చుకునే వారం. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది.

– సిరపురపు రామునాయుడు, రైతు, పెదవేమలి



విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో ఈ - క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకుడు

25న జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి

- కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన
- ఏర్పాట్లపై సమీక్షించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర, మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర తదితరులు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 25న శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కూడా పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లుపై ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికలతో కలసి విద్యాశాఖ మంత్రి స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షించారు. ఏర్పాట్లుపై పలు సూచనలు చేశారు. తక్కువ సమయం ఉన్నందున అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షం పడే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేదిక వద్ద, బహిరంగ సమావేశం, పార్కింగ్ వద్ద తాగునీరు మెడికల్ కిట్లను, అంబులెన్స్ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి మరడాం వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్నామని, హెలిపాడ్ వద్ద, కాన్వాయి, బహిరంగ సమావేశం, వేదిక వద్ద తగు బందోబస్తు, బారికేడింగ్ ఏర్పాట్లను పక్కాగా చేయాలన్నారు. ల్యాండ్ లెవెలింగ్, డెకరేషన్, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం ఏర్పాట్లను సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఏసీ సిస్టం ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఐఅండ్‌పీఆర్, విద్యుత్ అధికారులకు సూచించారు. వాహన పాస్‌లు, డ్యూటీపాస్‌లు, సీసీ కెమెరాలు, నెట్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫుడ్, తాగు నీరు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆహ్వాన పత్రాలను వెంటనే పంపాలని డీఆర్‌ఓకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి చినఅప్పలనాయుడు, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, గిరిజన యూనివర్సిటీ డీన్ మిశ్రా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలి పరిశీలించిన డిప్యూటీ సీఎం




సభ స్థలం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

దత్తిరాజేరు: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి ఈ నెల 25న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్‌తో కలిసి మెంటాడ మండలం కుంటినవలస వద్ద భూమి పూజ చేయనున్న స్థలాన్ని, దత్తిరాజేరు మండలం మరడాం వద్ద హెలీప్యాడ్ స్థలాన్ని, సభ స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడుతూ గిరిజన పక్షపాతి అయిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన నియోజకవర్గమైన సాలూరుకు గిరిజన యూనివర్సిటీ కేటాయించడంలో ఆయన చేసిన కృషి మరువలేదన్నారు. వారి వెంట జేసీ మయూర్‌అశోక్, ఆర్డీఓ శేషశైలజ, దత్తిరాజేరు, మెంటాడ ఎంపీపీ గేదెల సింహద్రి అప్పలనాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, తహసీల్దార్‌లు గురుమూర్తి, రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

చిన్నారి ఆరోగ్యానికి అండ

- సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చిన్నారి కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ చిన్నారి ఆరోగ్యానికి అండగా నిలిచి, ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వైద్యానికి సరిపడ ఆర్థిక సాయం వచ్చేలా చేశారు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి. విజయనగరం మండలం కొండకరకాం గ్రామానికి చెందిన తుంపిల్లి గణేష్‌కు ఆరు నెలల కుమారుడు గుణవర్ధన్ ఉన్నాడు. చిన్నారికి మూడు నెలల వయస్సులో బ్రెయిన్ సంబంధిత వ్యాధి వల్ల సర్జరీ చేయాల్సి వచ్చింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందించాల్సి ఉండగా.. ఆరోగ్యశ్రీ పథకం వర్తించకపోవడం, ఆ కుటుంబానికి వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని కలసి తమ పరిస్థితి విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన సీఎం సహాయ నిధికి ప్రతిపాదించారు. అక్కడ నుంచి ఆమోదం లభించడమే కాక, రూ. 1.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో సదరు చెక్కును ఆదివారం తన నివాసం వద్ద చిన్నారి కుటుంబ సభ్యులకు కోలగట్ల అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్లకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలి యజేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

పార్వతీపురం టౌన్: ఆశాజ్యోతి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి బాలల చట్టపరమైన హక్కులు గూర్చి వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞ నారాయణ రావు బాలకార్మిక వ్యవస్థకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ ప్రజలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, ఆశాజ్యోతి ఆశ్రమం ముఖ్య సలహాదారులు బడే నాగభూషణరావు, చెరుకూరు జగదీశ్వరరావు, ఆశ్రమ దాతలు వూన్న మోహనరావు, గౌరీశంకరరావు, రెడ్‌క్రాస్ ట్రెజరర్ పెంటపాటి సూర్యారావు పాల్గొన్నారు.

ఉప పోరులో... వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయదుందుభి

- ఎన్నికలు ఏవైనా వైఎస్సార్ సీపీ ఏకపక్ష విజయాలు
- పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ ఘన విజయం



కాబోతుల రుక్మిణమ్మ, సర్పంచ్



సువ్వాడ శ్రీదేవి, సర్పంచ్




కొండ్రోతు అనూష, సర్పంచ్



కరక గౌతమి, సర్పంచ్

విజయనగరం రూరల్:

రాష్ట్రంలో 2019 సార్వత్రిక ఎన్నికలు మొదలుకుని ఏ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ ఏకపక్ష విజయాలు సాధించి ప్రభంజనం సృష్టిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మా, అభివృద్ధి, సంక్షేమ పాలనను మెచ్చి రాష్ట్ర ప్రజలు ఏకపక్ష విజయాలు అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలతో సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయాలను కట్టబెట్టడంతో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు తన హామీలను సుమారు వంద శాతం నెరవేర్చారు. దీంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేషన్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 90 శాతానికి పైగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ఆ పార్టీ మద్దతు అభ్యర్థులే విజయం సాధించారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మెచ్చి రాష్ట్ర ప్రజలు అందిస్తున్న ఘన విజయాలే. అలాగే శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాల్లోనూ అదే జోరు కొనసాగింది.



ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 8 గ్రామ పంచాయతీ సర్పంచుల స్థానాలకు, 11 నియోజకవర్గాల పరిధిలో 84 వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థుల గెలుపు ఏకపక్షమేనని ప్రచార సమయంలో తేటతెల్లమైంది. విజయనగరం జిల్లా పరిధిలోని గజపతినగరం మండలం లోగిశ సర్పంచ్ స్థానంలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని కె.అనూష ఏకగ్రీవంగా ఎన్నిక కాగా.. పార్వతీపురం జిల్లా పరిధిలోని రెండు సర్పంచు స్థానాల్లో పాలకొండ మండలం పనుకువలస పంచాయతీ సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని కోట మంజు భార్గవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 6 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. ఐదు సర్పంచ్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు విజయాన్ని కై వసం చేసుకున్నారు. వంగర మండలం లక్ష్మీపేటలో ఒక్క చోటే ప్రతిపక్ష పార్టీ టీడీపీ మద్దతు అభ్యర్థి గెలుపొందారు. అలాగే ఉమ్మడి జిల్లాల పరిధిలో 84 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 73 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 64 వార్డు స్థానాలకు వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ 8, సీపీఐ - 1 వార్డు స్థానాన్ని కైవసం చేసుకుంది. మిగతా 11 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా ఎనిమిది స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు గెలుపొందగా, 3 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ మద్దతు అభ్యర్థులు గెలుపొందారు. గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాల్లో జనం మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడుస్తున్నారన్న విషయం తేటతెల్లమై ప్రతిపక్ష పార్టీలకు దిమ్మదిరిగే జవాబిచ్చినట్లు అయ్యిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం మరోసారి రిపీట్ అవుతుందని ఇప్పటికే సర్వేలు చెబుతుండగా, ఉప ఎన్నికల ఫలితాలు వాటిని రుజువు చేశాయని చెప్పొచ్చు.

పార్వతీపురం మన్యం జిల్లాలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు

అభ్యర్థి పేరు	పంచాయతీ	మండలం
టి. గోపాలరావు	గుమ్మ	కురుపాం
కోట మంజుభార్గవి	పనుకువలస	పాలకొండ

విజయనగరం జిల్లాలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు

అభ్యర్థి పేరు	పంచాయతీ	మండలం
సువ్వాడ శ్రీదేవి	పడాలపేట	విజయనగరం
కరక గౌతమి	పెంటశ్రీరాంపురం	గంట్యాడ
కాబోతుల రుక్మిణమ్మ	ఓనెఅగ్రహారం	వంగర
కె.అనూష (ఏకగ్రీవం)	లోగిశ	గజపతినగరం

క్లుప్తంగా

రిజర్వాయర్‌లో యువకుడి మృతదేహం


రిజర్వాయర్‌లో పడి మృతి చెందిన నాగరాజు

బొండపల్లి (మెంటాడ): మండలంలోని ఆంధ్ర రిజార్వాయర్‌లో లోతుగెడ్డ గ్రామానికి చెందిన యువకుడు మృతదేహం లభ్యమైంది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎలిగరపు నాగరాజు(24) మృతదేహాన్ని రిజర్వాయర్‌లో స్థానికులు గుర్తించి బయటకు తీసి ప్రమాద వశాత్తు జారిపడి ఉండవచ్చని భావించి ఆంధ్ర పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరంలోని సీహెచ్‌సీకి తరలించారు.

బెదిరించి.. దోపిడీ

విజయనగరం క్రైమ్: విధులు పూర్తిచేసుకుని ఇంటికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఇద్దరు ఆగంతుకులు బెదిరించి, చితక్కొట్టి, డబ్బు దోపిడీ చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫూల్‌బాగ్‌లో నివాసం ఉంటున్న గ్రంధి సత్యనారాయణ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నాడు. విధులు పూర్తయిన తర్వాత శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఫూల్‌బాగ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్ ఆపి, చితక్కొట్టి అతని దగ్గరున్న రూ.10వేలు నగదు పట్టుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులును ఆశ్రయించాడు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

జొన్నవలస గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 21 వేల 430 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జామిలో ఏడుగురు..

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామ శివారులో జరుగుతున్న పేకాటశిబిరంపై జామి ఎస్సై వీరబాబు, ఏఎస్సై నర్సింగరావు, హెచ్‌సీ ఈశ్వరరావు, సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఘటనా స్థలంలో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.51,590 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని, పేకాట, ఇతర పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

కూరల ధరతో రైతుకు ఊరట


రామభద్రపురం మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

- ప్రకృతి ప్రభావంతో తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో లాభసాటిగా ధరలు


మార్కెట్‌కు కూరగాయలు తీసుకొస్తున్న రైతులు

రామభద్రపురం మార్కెట్‌లో కూరగాయల ధరలిలా..

రకం	క్రేట్ ధర
బీర	రూ.700 నుంచి రూ.800
బెండ	రూ.200 నుంచి రూ.300
వంగ(నల్ల)	రూ.500 నుంచి రూ.600
తెల్ల వంకాయలు	రూ.600 నుంచి రూ.700
గుత్తి వంకాయలు	రూ.600 నుంచి రూ.700
చిక్కుడు(కిలో)	రూ.20 నుంచి రూ.30
కాకర	రూ.500 నుంచి రూ.600
దొండ(యూరియా బస్తా)	రూ.700 నుంచి రూ.800
ఆనప(ఒకటి)	రూ.15 నుంచి రూ.20
బంతి పువ్వులు తట్ట	రూ.250 నుంచి రూ.300
దొండ, దోస	రూ.550 నుంచి రూ.600
ఆగాకర కిలో(దేశ వాళీ)	రూ.80 నుంచి రూ.100

రామభద్రపురం: కూరగాయల సాగు రైతన్నలకు కాసులు కురిపిస్తోంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల సాగు కొంతమేర ఆలస్యమైంది. తర్వాత కొద్దిపాటి వర్షాలు కురవడంతో రైతులు సాగు చేశారు.పంట పెరుగుతూ పూతకొస్తున్న సమయంలో వర్షాభావం నెలకొనడంతో పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి పడిపోయింది. అయితే రామభద్రపురంలోని అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్లు కూరగాయల సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతినగా మిగిలిన కాస్తోకూస్తో పంటను రైతులు అమ్ముకుంటున్నారు. జిల్లాలో దాదాపు 3 వేల హెక్టార్లలో కూరగాయల సాగవుతాయని అధికారిక సమాచారం. రామభద్రపురం మండలంతో పాటు బొబ్బిలి, బాడంగి, మెరకముడిదాం, మెంటాడ, దత్తిరాజేరు, విజయనగరం, సాలూరు మండలాల్లో కూరగాయల సాగు ఎక్కువ. దొండ, వంగ, బీర, చిక్కుడు, ఆనప, కాకర పంటలు పండిస్తున్నారు. కూరగాయలు పండే రామభద్రపురం మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావంతో పాటు అప్పడప్పుడు కురిసిన కొద్దిపాటి వర్షాలకు కూరగాయ పంటలు తెగుళ్లు, చీడపీడల కారణంగా దెబ్బతినడం వల్ల దిగుబడి సగానికి సగం పడిపోయింది. కానీ మార్కెట్‌లో పలుకుతున్న ధరలు రైతులకు ఊరట కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో కూరగాయల రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది.

ఊహించని ధర..



ఇంత ధర ఊహించలేదు.కూరగాయల పంటలు రైతులను ఆదుకుంటున్నాయి.ఈ ధరలు నిలకడగా ఉంటే లాభదాయకంగా ఉంటుంది. నేను ఎకరా విస్తీర్ణంలో బీర సాగు చేస్తున్నాను.వర్షాభావం వల్ల దిగుబడి తగ్గింది.అయినా కాయల నాణ్యతను బట్టి క్రేట్ ధర దాదాపు రూ.800 వరకు పలుకుంతోంది.ధరలు ఆశాజనకంగా ఉండడంతో పెట్టుబడులకు ఢోకాలేదు.

– సీహెచ్ అప్పలనాయుడు, కూరగాయల రైతు

ధరలు ఆశాజనకం



గతం కంటే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. నేను ప్రతి ఏడాది రెండు మూడు రకాల కూరగాయ పంటలు సాగుచేస్తాను. ఈ ఏడాది కాకర, బీర సాగు చేశాను. గతంలో వాతావరణం అనుకూలించి దిగుబడి బాగున్నప్పుడు రెండు క్రేట్‌ల కూరగాయలు తీసుకొస్తే రూ.600 వచ్చేవి. వాతావరణ పరిస్థితి కారణంగా పంటలు బాగాదెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. కానీ ఇప్పుడు క్రేట్ కాకర కాయలను రూ.500 నుంచి రూ.600 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

– చింతల అప్పలనాయుడు,కూరగాయల రైతు

పల్లె ప్రగతికి పెద్దపీట


సీతారాంపురం పంచాయతీ కార్యాలయం


రామభద్రపురం మేజర్ పంచాయతీ గ్రామం

- గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం అడుగులు
- విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

రామభద్రపురం: నాలుగున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో ఏ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదు సరికదా సరైన సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబందులు పడేవారు. గ్రామంలో ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండేవారు కాదు.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి గ్రామంలోనూ పది మందికి పైగా ప్రభుత్వ సిబ్బందిని నియమించారు.నగరాలతో సమానంగా మారుమూల గ్రామాల్లో సైతం 543 రకాలకు పైగా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చి జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపన దిశగా పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించి ఏ పనినైనా సొంత గ్రామంలోనే పూర్తిచేసుకునే సౌలభ్యం కల్పించారు.దీనికి తోడు ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.ఇందుకు అనుగుణంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను మొదట విడత నిధులు జిల్లాకు విడుదలయ్యాయి.జిల్లాలోని 777 పంచాయతీలకు రూ.23.61.39,926లు విడుదలవగా ఇందులో అన్‌టైడ్ రూ.7,81,15,776, టైడ్ రూ.15,80,24,150 ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలో గల 22 పంచాయతీలకు రూ.93,92,259లు ఆయా పంచాయతీల పీడీ ఖాతాలకు జమకానున్నాయి. అయితే పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలోనే ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపులకు వీలుగా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు.ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది.పంచాయతీలలో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ-పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో లావాదేవీల వివరాల సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులకు తెలుస్తుంది.ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు, లేదా ఇతర ఉన్నతాధికారుల జోక్యం కూడా ఎక్కడా ఉండదని పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఖర్చు చేయాల్సిన విధి విధానాలు..

పంచాయతీలకు జమఅయిన నిధులను టైడ్,అన్‌టైడ్ భాగాలుగా విడగొట్టి మొదటి భాగంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. వీటితో పాటు శ్మశాన వాటికల అభివృద్ధికి కూడా వినియోగించుకోవచ్చు. ఈ-పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడిభాగాలు కొనుగోలు చేసేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీటి అవసరాలు, పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, చేతి పంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి.15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు

కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన రెండో విడత 15 ఆర్థిక సంఘం నిధులు రెండు రోజుల్లో పంచాయతీల పీడీ ఖాతాలకు జమచేయనున్నాం.ఈ నిధులకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పంచాయతీలు ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ-పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.ఈ- బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది.తప్పులు దొర్లితే సంబందిత సర్పంచ్,కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– ఎల్ శ్రీధర రాజా, డీపీఓ, విజయనగరం

సీనియర్స్ తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు సిద్ధం


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయి సీనియర్స్ తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది. ఈ నెల 26,27 తేదీల్లో కాకినాడలో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం స్థానిక విజ్జీ స్టేడియంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50మందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన వారిలో పురుషుల విభాగంలో ఆర్. శేఖర్, పి.దిలీప్, మణికంఠ, సీహెచ్ సాయి కుమార్ , పి.రామకృష్ణ, కె అరుణ్ కుమార్, ఎస్. రాహుల్, సాగర్ దొర, కె ఉదయ్ కుమార్ , కె శ్రీనివాసరావు, ఎస్ రవిలు ఉన్నారు. స్త్రీల విభాగంలో బి. స్వాతి, జి.రాధ, ఎస్ నవ్యలు అర్హత సాధించారు.

ఈహెచ్‌ఎస్ రోగులకు క్రానిక్ ఓపీ

- ఏరియా ఆస్పత్రుల్లో నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్రానిక్ ఓపీలో రోగిని చూస్తున్న వైద్యురాలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పాటుపడుతోంది. వారి కోసం ప్రత్యేక ఓపీ నిర్వహించి అవసరమైన వైద్యాన్ని అందించనుంది. ఇప్పటికే ఒకటి రెండు ఆస్పత్రుల్లో క్రానిక్ ఓపీ నిర్వహిస్తుండగా మిగతా ఆస్పత్రుల్లో కూడా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా ఆస్పత్రులు ఓపీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్) కింద ప్రభుత్వ ఉద్యోగులకు క్రానిక్ ఓపీ ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ఇకపై పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి, ఎస్.కోట, గజపతినగరం, రాజాం ప్రాంతీయ ఆస్పత్రుల్లో కూడా క్రానిక్ ఓపీ నిర్వహించనున్నారు. జిల్లాలో ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులు 60 వేల మంది ఉన్నారు. వారంతా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే ప్రత్యేకమైన క్రానిక్ ఓపీ సేవలను ఇకపై పొందనున్నారు. క్రానిక్ ఓపీలో ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకమైన స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులను పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తారు. క్రానిక్ ఓపీలో 25 రకాల వ్యాధులకు సేవలు అందిస్తారు.

విజయవిహారం

- అండర్-16 క్రికెట్ టోర్నీలో జిల్లా క్రీడాకారుల జైత్రయాత్ర


విజయనగరం జట్టుతో సెలెక్టర్ సర్ఫరాజ్, కోచ్

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 16 విభాగంలో జరుగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విజయనగరం జట్టు జైత్రయాత్ర కొనసాగిస్తోంది. వరుసగా జరిగిన రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లా కేంద్రంలోని బాబామెట్ట శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య శనివారం ప్రారంభమైన మూడు రోజుల మ్యాచ్‌లో విజయనగరం జట్టు ఒక రోజు మిగిలి ఉండగానే శ్రీకాకుళం జట్టుపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

మ్యాచ్ వివరాలు

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న విజయనగరం కెప్టెన్ శ్రీరామ్ సచిన్ నిర్ణయం సరైనదేనని నిరూపిస్తూ జట్టు బౌలర్లు శ్రీకాకుళం జట్టును శనివారం తక్కువ స్కోర్‌కే కట్టడి చేశారు. విజయనగరం బౌలర్ల ధాటికి శ్రీకాకుళం జట్టు 116 పరుగులకే ఆలౌటైంది. విజయనగరం జట్టు బౌలర్లలో తరుణ్ 4 వికెట్లు, ప్రీతమ్, ఫణీంద్ర రెండేసి వికెట్లు సాధించారు. తరువాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు మొదట్లో తడబడినా ఇన్నింగ్స్‌లో 138 పరుగులకు ఆలౌటై 22 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. ఆదివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మరోసారి స్వల్ప స్కోర్‌కే (103) అవుటైంది. విజయనగరం జట్టు బౌలర్లలో ప్రీతమ్, ఫణీంద్రలు నాలుగేసి వికెట్లు తీసి రాణించారు. అనంతరం 82 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు 5 వికెట్లు నష్టపోయి మూడోరోజు ఆట మిగిలి ఉండగానే విజయలక్ష్యాన్ని చేరుకుంది. జట్టు మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ దేవీ చరణ్ 27, తరుణ్ 25 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించారు. రెండు విజయాలతో 12 పాయింట్లు సాధించిన విజయనగరం జట్టు నార్త్‌జోన్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. జట్టు వరుస విజయాలు సాధించడంతో జట్టు సభ్యులతో పాటు కోచ్‌లు ఎస్ఎస్ఎస్ బహదూర్, చందక రమేష్, చందక చంద్రశేఖర్‌లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎస్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు సర్ఫరాజ్, పీఎస్ఎస్ వర్మ, పి.బంగార్రాజు అభినందించారు.

విశాఖకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

డెంకాడ మండలం చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో విశాఖ, తూర్పు గోదావరి జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో (324/9 డిక్లేర్) భారీ ఆధిక్యం సాధించగా , తూర్పుగోదావరి జట్టు 170 పరుగులు మాత్రమే చేసి ఫాలో ఆన్‌లో పడి రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. సోమవారం మూడో రోజు ఆట మిగిలి ఉంది.

మోటార్ సైకిల్స్ ఢీకొని ఒకరికి గాయాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రుడు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైక్‌లు ఢీకొనడంతో పట్టణంలోని యాత వీధికి చెందిన పురం మణికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడికి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

దేశ ఉన్నతికి యువత తోడ్పడాలి



మాట్లాడుతున్న ఎస్‌బీ సుదర్శన

విజయనగరం: జిల్లాలో లక్ష మంది యువతను లీడ్ ఇండియాలో భాగస్వాములను చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.బి. సుదర్శన ఆచార్య పిలుపునిచ్చారు. స్థానిక కణపాక యూత్ హాస్టల్‌లో ఆరు రోజులుగా జరుగుతున్న లీడ్ ఇండియా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శనాచార్య మాట్లాడుతూ మన దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దడమే లీడ్ ఇండియా ముఖ్య ఉద్దేశమని, అందుకోసం యువత ముందుకు రావాలని కోరారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములై క్రమశిక్షణతో జీవితాలను తీర్చిదిద్దుకొని తద్వారా దేశ ఉన్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త జ్ఞానేశ్ గురూజీ, హేమసుందర్, డాక్టర్ ఎం .వెంకటేశ్వరరావు, బి.సూర్యలక్ష్మి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ, విశ్రాంత ఎంపీడీవో శ్రీనివాసరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220